TGTEL/26/A7716

ఉద్యమ పోరు

UDYAMA PORU

ప్రతి పదం పోరాట కదం

వరంగల్ | సంపుటి : 1 | సంచిక : 25 | శనివారం | 10.10.2026 | పేజీలు : 8 | వెల : 3 /- | ఎడిటర్ - బండారి సుమంత్

తెలంగాణ ఆడపడుచులకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్, మాజీ సీఎం కెసిఆర్

- ప్రకృతి ఆరాధనకు, ఐక్యతకు బతుకమ్మ ప్రతీక అన్న సీఎం
- ఈ పండుగ తెలంగాణ సంస్కృతికి అద్దం పడుతుందన్న ముఖ్యమంత్రి
- బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన మాజీ సీఎం కేసీఆర్

2

సీఈసీ రాజీనామాకు పట్టు.. రాష్ట్రపతికి విపక్షాల ఫిర్యాదు

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని విపక్షాల డిమాండ్
- పార్లమెంట్ నుంచి రాష్ట్రపతి భవన్ వరకు రాహుల్ గాంధీ భారీ ర్యాలీ
- 13 కోట్ల ఓట్లను తిరిగి చేర్చాలని రాష్ట్రపతికి వినతిపత్రం

2

ఫలితాలు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్నట్టా?: కిషన్ రెడ్డి

- ప్రజా తీర్పును గౌరవించడం కాంగ్రెస్‌కు అలవాటు లేదన్న కిషన్ రెడ్డి
- రాహుల్ గాంధీ తీరులో ప్రమాదకర ధోరణులు కనిపిస్తున్నాయని విమర్శ
- ఫలితాలు వ్యతిరేకిస్తే రాజ్యాంగ సంస్థలపై కాంగ్రెస్ విష ప్రచారం చేస్తుందని మండిపాటు

2

నోయిడా విమానాశ్రయానికి మోదీ పేరు.. యోగి సర్కారు కీలక నిర్ణయం!

- పేరుమార్పు తీర్మానానికి యోగి మంత్రివర్గం ఆమోదం
- మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితం పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్ణయం
- మోదీకి రాష్ట్రంతో ప్రత్యేక అనుబంధం ఉందన్న యోగి

» 2

కరవుపై 12న మంత్రులతో రేవంత్‌రెడ్డి సమీక్ష

- ఈ నెల 12న ఉన్నతస్థాయి సమావేశం
- ఎల్ నినో ప్రభావంతో 17శాతం తగ్గిన వర్షపాతం
- రాష్ట్రంలోని 320 మండలాల్లో తీవ్ర కరవు ప్రభావం
- కేంద్రం నుంచి రూ.20,000 కోట్ల ప్యాకేజీ కోరిన రాష్ట్ర ప్రభుత్వం

ఉద్యమపోరు, హైదరాబాద్ : తెలంగాణలో నెలకొన్న తీవ్ర కరవు పరిస్థితులు, సహాయక చర్యలపై చర్చించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నారు. అక్టోబర్ 12న మంత్రులతో ప్రత్యేకంగా భేటీ అయి, రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం, దాని పర్యవసానాలపై ఆయన సమీక్ష జరపనున్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా వర్షాభావ ప్రాంతాలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం తక్షణమే చేపట్టాల్సిన చర్యలపై లోతుగా చర్చిస్తారు. వ్యవసాయం, సాగునీరు, తాగునీటి సరఫరా, పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ వంటి కీలక అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించనుంది. ఎల్ నినో ప్రభావంతో ఈసారి రాష్ట్రంలో సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదైనట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అక్టోబర్ 6 నాటి ప్రాథమిక అంచనాల ప్రకారం.. రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాలకు గాను 18 జిల్లాల్లోని 320 మండలాల్లో తీవ్ర కరవు ఛాయలు అలుముకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 621 మండలాల్లో దాదాపు సగం మండలాలు కరవు ప్రభావానికి గురైనట్లు అధికారిక వర్గాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, రాష్ట్రాన్ని కరవు పీడిత ప్రాంతంగా ప్రకటించాలని కోరుతూ ప్రభుత్వం ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. తక్షణ సహాయం కింద రూ. 20,000 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసింది. మంత్రివర్గ ఉపసంఘం చేపడుతున్న చర్యలు, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు, రైతు సంఘాలు, నిపుణుల నుంచి సలహాలు స్వీకరించడం వంటి అంశాలు కూడా ఈ భేటీలో చర్చకు వచ్చే అవకాశం ఉంది. మరోవైపు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఇప్పటికే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నిర్దేశించిన 12 ప్రామాణిక అంశాల ఆధారంగా అక్టోబర్ చివరి నాటికి సమగ్ర కరవు నివేదికను సిద్ధం చేయాలని ఆయన సూచించారు.

'సర్' అక్రమాలపై సుప్రీం విచారణ జరపాలి.. సీఈసీ రాజీనామా చేయాలి : కేటీఆర్

- సర్ ప్రక్రియలో భారీ అక్రమాలు జరిగాయన్న కేటీఆర్
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఓట్లు తొలగించారని ఆరోపణ
- సీఈసీకి వ్యతిరేకంగా రేపు హైదరాబాద్‌లో బీఆర్ఎస్ నిరసన

» 2

ఇక నుంచి కేటీఆర్ మమ్మల్ని గోకకపోయినా.. నేను గోకుతూనే ఉంటా! - వెంకట్ బల్మూర్

- కేటీఆర్ బాగోతాలను ప్రతీ వారం సీరియల్‌లా బయటపెడతానన్న వెంకట్
- ఆయన ఇంటికి, పార్టీ ఆఫీసుకు 'గోకుడు మందు' పంపిస్తున్నట్లు వెల్లడి
- డెక్కన్ సెరాయ్ హోటల్ వ్యాపారంపై విచారణ జరపాలని డిమాండ్

» 2

ప్రజల విశ్వాసాన్ని ఈసీ కోల్పోతోంది: హరీశ్ రావు

- అధికారంలో ఉన్నవారికి ఈసీ రక్షణ కవచం కాదన్న హరీశ్
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్
- అన్నిటికన్నా ప్రజాస్వామ్యం గొప్పదని వ్యాఖ్య

» 2

జీఓ 59పై మంత్రి పొంగులేటి ప్రకటన.. నెలలోగా దరఖాస్తులు క్లియర్

- జీఓ 59 పెండింగ్ దరఖాస్తులకు నెల లోగా పరిష్కారం
- సీఎం రేవంత్ రెడ్డి హామీ అమలులో భాగంగా ఈ నిర్ణయమని వెల్లడి
- దరఖాస్తుల పరిశీలనకు ఆదేశాలు జారీ చేశామన్న మంత్రి



ఉద్యమపోరు, డెస్క్ : తెలంగాణలో జీఓ 59 కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారంపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 500 చదరపు గజాల లోపు ఉన్న ప్లాట్లకు సంబంధించిన దరఖాస్తులను నెల రోజుల్లోగా పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన 22-ఏ సమస్యల పరిష్కార హామీ అమలులో ఇది మరో కీలక ముందడుగు అని అన్నారు. ఈ మేరకు పెండింగ్ దరఖాస్తులను పరిశీలించాలని ఆదేశిస్తూ ప్రభుత్వం మెమో నెం. 48030 జారీ చేసిందని మంత్రి వివరించారు. "జీఓ 59 అమలులో ఎలాంటి అక్రమాలకు తావులేదు. నిబంధనల ప్రకారమే నిర్ణయాలు ఉంటాయి" అని ఆయన హామీ ఇచ్చారు. గతంలో జారీ చేసిన కన్వేయన్స్ డీడ్‌లపై కూడా సమగ్ర సమీక్ష నిర్వహిస్తామని పొంగులేటి వెల్లడించారు...

2

రేవంత్ రెడ్డి కుటుంబం ఓ అనకొండ ఫ్యామిలీ : మన్నె క్రిశాంక్

817 ఎకరాల ప్రభుత్వ భూమి తాకట్టు పెట్టి రూ.12,818 కోట్ల రుణం తీసుకున్నారన్న క్రిశాంక్

భూముల విలువ తగ్గించి రుణాలు పొందారంటూ ఆరోపణ

తెలంగాణ సంపద కోసం పోరాడుతూనే ఉంటానని వెల్లడి

ఉద్యమపోరు, హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబం తెలంగాణలో అక్రమాస్తులు కూడగడుతూ 'అనకొండ ఫ్యామిలీ'గా మారిందని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వంపై సంచలన విమర్శలు చేశారు. హైదరాబాద్‌లోని ఇజ్జత్ నగర్, మోకిల, మియాపూర్, ఇంజాపూర్, చిలుకూరు, పటాన్‌చెరు, గాజులరామారం, జవహర్ నగర్ వంటి అత్యంత విలువైన ప్రాంతాల్లోని 817 ఎకరాల భూమిని తాకట్టు పెట్టి రూ.12,818 కోట్లకు పైగా రుణాలు సమీకరించారని ఆయన ఆరోపించారు. ఈ భూముల మార్కెట్ విలువ ఎకరానికి రూ.150 కోట్లకు పైగా ఉండగా, కేవలం రూ.15 కోట్లుగా చూపించి రుణాలు పొందారని విమర్శించారు. తాకట్టు పెట్టిన భూమిలో కేఎల్ఎస్ఆర్ ఇన్ఫ్రా సంస్థ ఎలా కంటైనర్లను ఏర్పాటు చేసిందని ఆయన ప్రశ్నించారు. తాను అక్రమాస్తులపై ప్రశ్నిస్తుంటే నిజం బయటపడుతుందన్న భయంతోనే ముఖ్యమంత్రి, ఆయన బృందం స్పందించడం లేదని క్రిశాంక్ అన్నారు. తాను వ్యక్తిగత ఆస్తుల గురించి కాకుండా, తెలంగాణ సంపద గురించే ప్రశ్నిస్తున్నానని, ఎన్ని బెదిరింపులు వచ్చినా రాష్ట్ర వనరుల పరిరక్షణకు పోరాడుతూనే ఉంటానని స్పష్టం చేశారు.

ప్రజల విశ్వాసాన్ని ఈసీ కోల్పోతోంది : హరీశ్ రావు

మొదటిపేజీ తరువాయి.. భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికల సంఘం (ఈసీ) వెన్నెముక వంటిదని, అది అధికారంలో ఉన్నవారికి రక్షణ కవచంలా మారకూడదని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం పనితీరు, నియామకాలపై వస్తున్న ప్రశ్నలతో రాజ్యాంగ పునాదులు బలహీనపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సవరణలో (సర్) భాగంగా పెద్ద ఎత్తున ఓట్లను తొలగించడం వల్లే ఈసీపై ప్రజలకు నమ్మకం పోతోందన్నారు. "ప్రజాస్వామ్యం అన్నింటికన్నా గొప్పది. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడంలో విఫలమైతే, అందుకు బాధ్యత వహిస్తూ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తప్పుకోవాలి" అని హరీశ్ రావు స్పష్టం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 324, 325, 326 ప్రకారం స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలు జరగాలని గుర్తుచేశారు.

జీఓ 59పై మంత్రి పొంగులేటి ప్రకటన.. నెలలోగా దరఖాస్తులు క్లియర్

మొదటిపేజీ తరువాయి.. సీఎం హామీ ఇచ్చిన 24 గంటల్లోనే 22-ఏ సమస్యలపై ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశామని... 10 నుంచి 12 రకాల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన అన్నారు. జీఓ 118, జీఓ 76లకు అనుగుణంగా స్పష్టమైన మెమోలు జారీ చేసినట్లు తెలిపారు. అలాగే జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ వంటి సంస్థల నుంచి ముందస్తు అనుమతులు పొంది 22-ఏ జాబితాలో ఉన్న ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు కూడా అనుమతి ఇస్తున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు.

ఫలితాలు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్నట్టా? : కిషన్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి.. కాంగ్రెస్ పార్టీకి, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ప్రజా తీర్పును గౌరవించడం అలవాటు లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. రాహుల్ గాంధీ పనితీరులో ఒక వింత, ప్రమాదకరమైన ధోరణి కనిపిస్తోందని ఆయన ఆరోపించారు. వారికి అనుకూలంగా ఫలితాలు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్నట్టా? అని ప్రశ్నించారు. ఫలితాలు వ్యతిరేకంగా వస్తే రాజ్యాంగ సంస్థలపై విష ప్రచారం చేస్తారా? అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేయనప్పుడల్లా ఎన్నికల సంఘం, కాగ్, న్యాయవ్యవస్థ, పార్లమెంట్ వంటి రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీయడం అలవాటుగా మార్చుకుందని ఆయన ఆరోపించారు. ప్రజాతీర్పు వ్యతిరేకంగా వచ్చినప్పుడు, రాజ్యాంగ సంస్థలు అవినీతిమయమయ్యాయని కాంగ్రెస్ నేతలు ఆరోపణలకు దిగుతున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ కీలకమైన సంస్థలపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని దెబ్బతీసే లక్ష్యంతోనే కాంగ్రెస్ ఇలాంటి ప్రచారాలు చేస్తోందని ఆయన విమర్శించారు.

నోయిడా విమానాశ్రయానికి మోదీ పేరు.. యోగి సర్కారు కీలక నిర్ణయం!

మొదటిపేజీ తరువాయి.. ఉత్తర్‌ప్రదేశ్‌లోని నోయిడాలో ఉన్న జెవార్ అంతర్జాతీయ విమానాశ్రయం పేరును మార్చాలని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇకపై ఈ విమానాశ్రయాన్ని 'నరేంద్ర మోదీ అంతర్జాతీయ విమానాశ్రయం'గా పిలవనున్నారు. ప్రధాని మోదీ ప్రజా సేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రివర్గం తీర్మానాన్ని ఆమోదించిందని తెలిపారు. శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో మొత్తం 39 ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. అనంతరం మీడియాతో మాట్లాడిన యోగి.. దేశ, రాష్ట్ర అభివృద్ధిలో మోదీ 25 ఏళ్ల ప్రజా సేవ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌తో ప్రధానికి ప్రత్యేక అనుబంధం ఉందని, వారణాసి నుంచి ఎంపీగా ఎన్నికైన ఆయన నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు సాగుతోందని చెప్పారు. 2017కు ముందు రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు అంతంత మాత్రంగానే ఉండేవని యోగి పేర్కొన్నారు. ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్‌వేలు, జాతీయ రహదారులు, మెట్రో, రీజినల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ వ్యవస్థలతో రవాణా సౌకర్యాలు గణనీయంగా మెరుగయ్యాయని తెలిపారు. అయోధ్య రామమందిర నిర్మాణం, కాశీ విశ్వనాథ్ కారిడార్ అభివృద్ధి వంటి కార్యక్రమాలను కూడా ప్రస్తావించారు. జెవార్‌లో నిర్మిస్తున్న నోయిడా విమానాశ్రయం ఉత్తర్‌ప్రదేశ్‌కు అందించిన గొప్ప బహుమతిగా యోగి అభివర్ణించారు. ఇది భవిష్యత్తులో దేశంలోనే కీలక విమానయాన కేంద్రంగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విమానాశ్రయం తొలి దశను ప్రధాని మోదీ ఈ ఏడాది మార్చిలో ప్రారంభించారు. మొదటి దశలో ఏడాదికి సుమారు 1.2 కోట్ల మంది ప్రయాణికులకు సేవలందించే సామర్థ్యం ఉండనుంది. నాలుగు దశల నిర్మాణం పూర్తయితే ఆసియాలోనే అతిపెద్ద విమానాశ్రయాల్లో ఒకటిగా నిలవనుంది.

సీఈసీ రాజీనామాకు పట్టు.. రాష్ట్రపతికి విపక్షాల ఫిర్యాదు

మొదటిపేజీ తరువాయి.. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) పనితీరుపై ప్రతిపక్షాలు తమ పోరాటాన్ని తీవ్రతరం చేశాయి. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాల ని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో 'ఇండియా' కూటమి ఎంపీలు, నాయకులు పార్లమెంట్ నుంచి రాష్ట్రపతి భవన్ వరకు శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం 10 మంది సభ్యుల ప్రతినిధి బృందం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి వినతిపత్రం సమర్పించింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్నది తమ ప్రధాన డిమాండ్ అని ప్రతిపక్షాలు స్పష్టం చేశాయి. దీనితో పాటు, వివాదాస్పదంగా మారిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని, ముసాయిదా జాబితాల నుంచి అన్యాయంగా తొలగించిన 13 కోట్ల మంది ఓటర్ల పేర్లను తిరిగి చేర్చాలని వారు రాష్ట్రపతిని కోరారు. ఈ మేరకు 16 పార్టీలకు చెందిన నేతలు సంతకాలు చేసిన మెమొరాండంను ఆమెకు అందజేశారు. ర్యాలీ సందర్భంగా విపక్ష నేతలు కర్తవ్య పథ్‌పై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. 'ఓట్ చోరీ' జరిగిందని, ఈసీ-బీజేపీ కుమ్మక్కయ్యాయని ఆరోపిస్తూ నినాదాలు చేశారు. "జ్ఞానేశ్, ఇట్స్ డన్ బ్రో!" వంటి ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, "జ్ఞానేశ్ కుమార్ తీసుకున్న నిర్ణయాల వల్ల దేశంలో ఆందోళనకర వాతావరణం నెలకొంది. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. అందుకే రాష్ట్రపతిని కలిసి వాస్తవాలను వివరిస్తున్నాం" అని పేర్కొన్నారు. దేశంలో నెలకొన్న అక్రమ వ్యవస్థకు జ్ఞానేశ్ కుమార్ కవచంలా నిలుస్తున్నారని ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా విమర్శించారు. మరోవైపు, పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా పోరాడి విద్యాశాఖ మంత్రి రాజీనామాకు కారణమైన 'కాక్రోచ్ జనతా పార్టీ', శనివారం జంతర్ మంతర్ వద్ద నిరసనకు పిలుపునిచ్చింది. దీంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. జంతర్ మంతర్ పరిసరాల్లో 4 కిలోమీటర్ల పరిధిలో వేలాది మంది పోలీసులను మోహరించడంతో పాటు, శుక్రవారం రాత్రి నుంచి 24 గంటల పాటు ఇంటర్నెట్ సేవలను నిలిపివేసింది. విపక్షాల ఆందోళనలపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తీవ్రంగా స్పందించారు. వరుస ఓటములను జీర్ణించుకోలేకే ఇండియా కూటమి రాజ్యాంగబద్ధ వ్యవస్థలపై నిందలు వేస్తోందని ఆయన విమర్శించారు. "ప్రధాని మోదీ నాయకత్వంపై ప్రజలకున్న విశ్వాసానికి ఇటీవలి ఉప ఎన్నికల ఫలితాలే నిదర్శనం. ఆత్మపరిశీలన చేసుకోకుండా ఆరోపణలు చేయడం వారి రాజకీయ నైరాశ్యాన్ని బయటపెడుతోంది" అని ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

'సర్' అక్రమాలపై సుప్రీం విచారణ జరపాలి.. సీఈసీ రాజీనామా చేయాలి: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి.. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (SIR) ప్రక్రియలో భారీ అక్రమాలు జరిగాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. జరిగిన అక్రమాలపై తీవ్ర స్థాయిలో స్పందించారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టి, సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. అదే సమయంలో, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని కోరారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కేటీఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు. భారత రాజ్యాంగానికి మించింది ఏదీ లేదని, ఏ ఒక్క భారత పౌరుడి ఓటు హక్కును హరించలేరని ఆయన స్పష్టం చేశారు. ఒక వ్యక్తిని కాపాడటం కోసం 140 కోట్ల మంది భారతీయుల హక్కులను ఎలా కాలరాస్తారని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన ఓటు హక్కును బలహీనపరిచే కుట్రలపై న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. SIR ప్రక్రియలో భాగంగా, ముఖ్యంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో భారీ ఎత్తున ఓటర్ల పేర్లను తొలగించారని ఆయన ఆరోపించారు. మరోవైపు, రేపు హైదరాబాద్‌లోని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ ప్రకటించింది. ఈ ఆందోళనలను భవిష్యత్తులో ఢిల్లీకి కూడా విస్తరిస్తామని పార్టీ వర్గాలు తెలిపాయి.

తెలంగాణ ఆడపడుచులకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన - సీఎం రేవంత్, మాజీ సీఎం కెసిఆర్

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణ ప్రజలకు, ముఖ్యంగా రాష్ట్ర మహిళలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. శనివారం నుంచి ప్రారంభం కానున్న ఈ తొమ్మిది రోజుల పూల ఉత్సవాలను మహిళలందరూ ఆనందోత్సాహాల మధ్య, సంప్రదాయ పాటలు, నృత్యాలతో ఘనంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక సందేశాన్ని విడుదల చేశారు. బతుకమ్మ పండుగ తెలంగాణ విశిష్ట సంస్కృతికి అద్దం పడుతుందని, ప్రకృతిని ఆరాధించే అత్యంత గొప్ప సంప్రదాయమని సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి, గౌరమ్మను పూజించడం తెలంగాణ జీవన విధానంలో ఒక భాగమని ఆయన పేర్కొన్నారు. ఎంగిలిపూల బతుకమ్మతో మొదలై సద్దుల బతుకమ్మ వరకు సాగే ఈ వేడుకలు ప్రజల మధ్య ఐక్యతను, సామూహిక జీవన సౌందర్యాన్ని చాటిచెబుతాయని ఆయన కొనియాడారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత తమ ప్రభుత్వం బతుకమ్మను రాష్ట్ర పండుగగా గుర్తించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ పండుగ నేడు తెలంగాణ ప్రజల జీవనశైలిలో ఒక అంతర్భాగంగా మారిపోయిందని ఆయన పేర్కొన్నారు.

ఇక నుంచి కేటీఆర్ మమ్మల్ని గోకకపోయినా.. నేను గోకుతూనే ఉంటా..! : వెంకట్ బల్మూర్

మొదటిపేజీ తరువాయి.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ప్రభుత్వ విప్ వెంకట్ బల్మూర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేటీఆర్ వ్యవహారశైలిపై సంచలన ఆరోపణలు చేసిన ఆయన, ఇకపై ప్రతీ వారం ఒక సీరియల్ లాగా ఆయన బాగోతాలను బయటపెడతానని హెచ్చరించారు. "ఇక నుంచి కేటీఆర్ మమ్మల్ని గోకకపోయినా, నేను గోకుతూనే ఉంటా" అని వ్యాఖ్యానించిన బల్మూర్, కేటీఆర్ ఇంటికి, పార్టీ ఆఫీసుకు 'గోకుడు మందు' (ఇచ్ గార్డ్) పంపిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా వెంకట్ బల్మూర్ మాట్లాడుతూ.. తాము కేటీఆర్ బాగోతాలు బయటపెడితే, బీఆర్ఎస్ నేతలు తమ ముఖ్యమంత్రిపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిస్తున్నారని ఆరోపించారు. 2019 నుంచి 2022 మధ్య ఓ సినీ నటితో జరిపిన సోషల్ మీడియా సంభాషణలను కేటీఆర్ ఎందుకు డిలీట్ చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ హోటల్ వ్యాపార రహస్యాలు ప్రజల ముందు ఉంచాలన్నారు. "2015లో రూ.5 కోట్లుగా ఉన్న దెక్కన్ సెరాయ్ హోటల్ షేర్ విలువ, పదేళ్లలో రూ.175 కోట్లకు ఎలా పెరిగింది? ఈ అంశంపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి విచారణ కోరతాం" అని స్పష్టం చేశారు. ఏ విచారణకైనా సిద్ధమని చెప్పే కేటీఆర్, పాస్‌పోర్ట్ సీజ్ చేయాలన్న పోలీసుల అభ్యర్థనపై కోర్టును ఎందుకు ఆశ్రయించారని బల్మూర్ ప్రశ్నించారు. కేటీఆర్ చెప్పేవి నీతి మాటలని, చేసేవి అవినీతి పనులని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్‌ను అరికట్టేందుకు కృషి చేస్తుంటే, కేటీఆర్ డ్రగ్స్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా మారుతున్నారని తీవ్ర ఆరోపణ చేశారు. తాను చెప్పేవన్నీ అబద్ధాలైతే కేటీఆర్ లైవ్‌లోకి వచ్చి వాస్తవాలు చెప్పాలని, డ్రగ్ టెస్టుకు సిద్ధమని ప్రకటించాలని సవాల్ విసిరారు. ప్రస్తుతం కేసీఆర్ కూడా కేటీఆర్‌తో మాట్లాడటం లేదని, తండ్రీకొడుకుల మధ్య పంచాయతీని నవీన్ రావు తండ్రి కొండల్ రావు పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారని బల్మూర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ ఎందుకు ఎవరితో కలవడం లేదో బీఆర్ఎస్ మిత్రులు కూడా ఆలోచించాలని ఆయన సూచించారు. అంతేకాకుండా, ఫాంహౌస్ లో కేటీఆర్ కు రహస్య ట్రీట్ మెంట్ అంటూ సంచలన ట్వీట్లు కూడా చేశారు.

TGTEL/26/A7716
ఉద్యమ పోరు
ప్రతి పదం పోరాట కదం
శనివారం 10.10.2026

బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక

బ్రాహ్మణపల్లి గ్రామ ప్రజలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన ఊట్ల బిక్షం

ఉద్యమపోరు, గుండాల, బ్రాహ్మణపల్లి, అక్టోబర్ 09 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను గ్రామ ప్రజలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఊట్ల బిక్షం ఆకాంక్షించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా బ్రాహ్మణపల్లి గ్రామ ప్రజలకు, ఆడపడుచులకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానాన్ని, ప్రకృతితో మనకున్న అనుబంధాన్ని చాటిచెప్పే గొప్ప పండుగ అని పేర్కొన్నారు. పూలను పూజిస్తూ మహిళలు సంప్రదాయబద్ధంగా నిర్వహించే బతుకమ్మ వేడుకలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని అన్నారు.ఈ పండుగ ప్రతి ఇంటా సంతోషాన్ని నింపాలని, గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. గ్రామంలో ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం మరింత బలపడాలని, ప్రతి కుటుంబంలో సిరిసంపదలు వెల్లివిరియాలని కోరుకున్నారు.బ్రాహ్మణపల్లి గ్రామ ప్రజలందరికీ మరోసారి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఊట్ల బిక్షం పేర్కొన్నారు.

చిన్నారికి అండగా పట్నం అవినాష్ రెడ్డి

- "నాకు మా నాన్న కావాలి".. చిన్నారి సమాధానంతో స్పందించిన కేటీఆర్

ఉద్యమపోరు, షాబాద్, అక్టోబర్ 09 : సిరికొండ మండల కేంద్రంలోని పీఎం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల & జూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థిని దేవి విజ్ఞ జిల్లా స్థాయి అండర్–19 వాలీబాల్ జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కలిగోట్ లో నిర్వహించిన వాలీబాల్ ఎంపిక పోటీల్లో దేవి విజ్ఞ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఈ స్థానాన్ని కైవసం చేసుకుంది. విద్యార్థిని సాధించిన ఈ విజయంపై ప్రిన్సిపాల్ హర్షం వ్యక్తం చేస్తూ, తమ పాఠశాల విద్యార్థి జిల్లా స్థాయికి ఎంపిక కావడం సిరికొండ మండలానికి, పాఠశాలకు ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్ రెడ్డి మాట్లాడుతూ మా పాఠశాలలో విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రత్యేక శిక్షణ, ప్రోత్సాహం అందిస్తున్నాం. దేవి విజ్ఞ క్రమ శిక్షణ, నిరంతర సాధన మరియు పట్టుదలే ఈ విజయానికి కారణం. భవిష్యత్తులోనూ ఆమె మరిన్ని ఉన్నత స్థాయి పోటీల్లో పాల్గొని, రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలకు, మన సిరికొండ మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నాం" అని తెలిపారు.విద్యార్థిని జిల్లా అండర్–19 జట్టుకు ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయ బృందం, వ్యాయామ ఉపాధ్యాయులు (PET), తోటి విద్యార్థులు దేవి విజ్ఞకు శుభాకాంక్షలు తెలియజేశారు.

నర్సంపేటలో FMGE వైద్యుల నిరసన

- సమాన స్టైఫండ్ ఇవ్వాలని డిమాండ్

ఉద్యమపోరు, నర్సంపేట, అక్టోబర్ 09 : నర్సంపేట మెడికల్ కాలేజ్ మరియు హాస్పిటల్ లో ఇంటర్న్‌షిప్ చేస్తున్న FMGE వైద్యులు శుక్రవారం రోజున ఆసుపత్రి ఆవరణలో నిరసన చేపట్టారు.సమాన పనికి సమాన స్టైఫండ్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు చేతబట్టి ఆందోళన వ్యక్తం చేశారు. "EQUAL WORK = EQUAL PAY", "FMGE DOCTORS ARE NOT FREE WORKERS", "SAME INTERNSHIP SAME STIPEND" అంటూ ఆంగ్లంలో, "స్టైపెండ్ కోసం కాదు సమానత్వం కోసం పోరాటం!", "మా శ్రమకు స్టైపెండ్ మా హక్కు!" అంటూ తెలుగులో నినాదాలు చేశారు.ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. విదేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసి, కేంద్ర ప్రభుత్వం నిర్వహించే FMGE పరీక్షలో ఉత్తీర్ణులై, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ద్వారా మెరిట్ ప్రకారం నర్సంపేట మెడికల్ కాలేజీకి కేటాయించబడ్డామని తెలిపారు.ఇక్కడ భారతీయ వైద్య విద్యార్థులతో సమానంగా 12 గంటల డ్యూటీలు, ఎమర్జెన్సీ, రాత్రి డ్యూటీలు చేస్తున్నప్పటికీ తమకు స్టైఫండ్ విషయంలో వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణ ప్రభుత్వం 2025 జూన్ 28న జారీ చేసిన జీవో ప్రకారం ఎంబీబీఎస్ ఇంటర్న్‌లకు రూ.29,792 స్టైఫండ్ ఇస్తుండగా, FMGE వైద్యులకు ఆ మొత్తం ఇవ్వడం లేదని, కొన్ని చోట్ల అసలు ఇవ్వట్లేదని వారు పేర్కొన్నారు. NMC 2022 మార్గదర్శకాలు మరియు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం తమకు కూడా సమాన స్టైఫండ్ ఇవ్వడం తమ హక్కు అని స్పష్టం చేశారు.వెంటనే తెలంగాణ ప్రభుత్వం, వైద్య విద్య శాఖ స్పందించి నర్సంపేట మెడికల్ కాలేజ్ లోని FMGE ఇంటర్న్‌లకు సమాన స్టైఫండ్ అమలు చేసి, పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

కాన్షీరాం ఆశయ సాధనే లక్ష్యం.. బహుజన రాజ్యాధికారమే ధ్యేయం

కాన్షీరాం వర్ధంతి సందర్భంగా ధర్మ సమాజ్ పార్టీ నాయకుల నివాళులు

ఉద్యమపోరు, కేశంపేట, అక్టోబర్ 09 : బహుజనులు రాజ్యాధికారాన్ని సాధించాలనే మాన్యశ్రీ కాన్షీరాం ఆశయాలను కొనసాగిస్తూ, ఆయన కలలను సాకారం చేసేందుకు నిరంతరం కృషి చేస్తామని ధర్మ సమాజ్ పార్టీ కేశంపేట మండల అధ్యక్షుడు మహిపాల్ మహారాజ్ తెలిపారు. శుక్రవారం కాన్షీరాం వర్ధంతిని పురస్కరించుకుని పార్టీ అధినేత డాక్టర్ విశారదన్ మహారాజ్ ఆదేశాల మేరకు కేశంపేట మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మహిపాల్ మహారాజ్ మాట్లాడుతూ,, దేశంలోని బహుజనులు రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చెంది పాలనా పగ్గాలు చేపట్టాలన్నది కాన్షీరాం ప్రధాన ఆశయమని పేర్కొన్నారు. ఆ ఆశయ సాధన కోసం ధర్మ సమాజ్ పార్టీ నిరంతరం పనిచేస్తుందని స్పష్టం చేశారు. కాన్షీరాం ప్రారంభించిన పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తూ, తెలంగాణ రాష్ట్రంలో బహుజన రాజ్యాధికార సాధన దిశగా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. బహుజనులకు సమాన అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలనే లక్ష్యంతో పార్టీ కార్యకలాపాలను విస్తరిస్తామని పేర్కొన్నారు.కాన్షీరాం చూపిన మార్గంలో నడుస్తూ, ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నాయకులు అభిప్రాయపడ్డారు. బహుజనుల ఐక్యత, చైతన్యం, రాజకీయ భాగస్వామ్యంతోనే ఆశించిన మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు రమేష్ గౌడ్, మల్లేష్ మహారాజ్, కృష్ణ, ఆనంద్, నరేష్, పురుషోత్తం, రమేష్, భాస్కర్, మహేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను నట్టేట ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం

- డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి

ఉద్యమపోరు, నర్సంపేట, అక్టోబర్ 09 : అధికారంలోకి వస్తే రైతులకు స్వర్గధామం చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు అన్నదాతలను నట్టేట ముంచిందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బస్వాపురం నరసయ్య, బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తీవ్రంగా ధ్వజమెత్తారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ తుగ్లక్ పాలన వల్లనే రైతులకు కరెంటు కష్టాలు మొదలయ్యాయని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ చేతగానితనం, అనాలోచిత విధానాల వల్లే నేడు రాష్ట్రంలో విద్యుత్ కోతలు పెరిగిపోయాయని ఆరోపించారు.

తిమ్మాపురం సబ్ స్టేషన్ వద్ద ధర్నా, అరెస్టులు :
యని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రప్రోగ్రాం కన్వీనర్ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లాడి తిరుపతి రెడ్డి నేతృత్వంలో మరియు కిసాన్ మోర్చా వరంగల్ జిల్లా అధ్యక్షులు దండు కిషన్ ఆధ్వర్యంలో ఖమ్మం హైవే రోడ్డులోని తిమ్మాపురం సబ్ స్టేషన్ వద్ద రైతులు, కిసాన్ మోర్చా నాయకులు భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఈ ఆందోళన కార్యక్రమానికి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బస్వాపురం లక్ష్మీ నరసయ్య, జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, జాతీయ కౌన్సిల్ మెంబర్ గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు మార్తినేని ధర్మారావు, కొండేటి శ్రీధర్ గార్లు ముఖ్య అతిథులుగా హాజరై కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై తీవ్రంగా విరుచుకుపడ్డారు.రైతుల పక్షాన బీజేపీ ధర్నా చేస్తుండగా పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. పోలీసులకు, బీజేపీ నాయకులకు మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం పలువురు నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్ కు తరలించారు.అనంతరం నాయకులు మాట్లాడుతూ గతంలో రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సరైన సమయంలో కరెంటు ఇవ్వకపోవడంతో వరి, పత్తి పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కోతల కారణంగా రైతులు రాత్రి వేళల్లో పొలాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందని, పాములు, తేళ్ల భయంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వ్యవసాయం చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు.అకాల వర్షాలు, కరెంటు కోతలతో నష్టపోతున్న రైతులను ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (PMFBY) పథకాన్ని రాష్ట్రంలో వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే అడ్డుకుంటోందని మండిపడ్డారు.ప్రభుత్వం వెంటనే మేల్కొని రైతులకు నిరంతరాయ విద్యుత్ సరఫరా చేయడంతో పాటు ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బిజెపి జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు గోలి మధుసూదన్ రెడ్డి, జాతీయ కౌన్సిల్ మెంబర్లు మర్తనేని ధర్మారావు, గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు కొండేటి శ్రీధర్, మాజీ మేయర్ డాక్టర్ టి. రాజేశ్వరరావు, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పడమట జగన్మోహన్ రెడ్డి, దేవర శీను, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు నూతనకంటి శ్రీనివాస్ రెడ్డి, గంగారెడ్డి, యాదగిరి రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, జలగం రంజిత్ రావు, సిద్ధం నరేష్, ముత్తిరెడ్డి కేశవ రెడ్డి, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శులు బన్న ప్రభాకర్, మాదిరెడ్డి దేవేందర్ రెడ్డి, అమృత రావు, మరియు వరంగల్ జిల్లా బిజెపి పదాధికారులు, వివిధ మోర్చా జిల్లా అధ్యక్షులు, మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

చింతకుంటపల్లిలో భూ సర్వే పనుల పరిశీలన..

పారదర్శకతకు ప్రాధాన్యమివ్వాలని ఆర్డీఓ సరిత సూచన

ఉద్యమపోరు, కేశంపేట, అక్టోబర్ 09 : కేశంపేట మండలం చింతకుంటపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ సర్వే పనులను ఆర్డీఓ సరిత, తహసీల్దార్ రాజేందర్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే ప్రక్రియలో భాగంగా చేపడుతున్న పనుల పురోగతిని సమీక్షించి, సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.భూ సర్వేను పారదర్శకంగా, తప్పులకు తావు లేకుండా నిర్వహించాలని ఆర్డీఓ సరిత అధికారులకు సూచించారు. భూ యజమానులకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, భూముల హద్దులు, ఇతర రికార్డుల విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. సర్వే ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారి సందేహాలను పరిశీలించి తగిన విధంగా స్పందించాలని సూచించారు. సర్వే పనులను బాధ్యతాయుతంగా పూర్తి చేసి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ పరిశీలన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోచమోని రమేష్ యాదవ్, సర్వేయర్ వెంకటేష్, వార్డు సభ్యులు మల్లేష్ యాదవ్, రఘుమ రెడ్డి, జంగయ్య యాదవ్, ప్రవీణ్‌తో పాటు గ్రామస్థులు పారేష్, యాదయ్య, నవీన్, నరేష్, రమేష్, అనిల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

TGTEL/26/A7716
ఉద్యమ పోరు
ప్రతి పదం పోరాట కదం
శనివారం 10.10.2026

డిప్యూటీ కలెక్టర్ కు దేవి నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వాన పత్రిక అందజేసిన ఆర్యవైశ్య సంఘాలు

ఉద్యమపోరు, ఖమ్మం /కల్లూరు, అక్టోబర్ 09 : ఖమ్మం గుట్టల బజార్లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవ్యాలయంలో 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని దేవి నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి రావాల్సిందిగా ఆహ్వానిస్తూ డిప్యూటీ కలెక్టర్ అజయ్ యాదవ్ గారికి ఆహ్వాన పత్రిక మరియు కల్లూరు ఆర్యవైశ్య సంఘాలచే జరిగే దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో కూడా పాల్గొనాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు పసుమర్తి సీతాచంద్రరావు, కల్లూరు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చలువాది నగేష్, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అనుమోలు శ్రీనివాసరావు, కల్లూరు ఆర్యవైశ్య కళ్యాణ మండపం అధ్యక్షులు దోసపాటి క్రిష్ణార్జునరావు, చారుగుండ్ల వెంకటేశ్వరరావు, చుండూరు నాగేంద్రబాబు తదితర ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు., సీనియర్ విద్యార్థులు, నూతన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టిఆర్ఎస్ పార్టీ లో చేరిన ఎంసీపీఐ (యు)నాయకులు

ఉద్యమపోరు, శేరిలింగంపల్లి, అక్టోబర్ 09 : శేరిలింగంపల్లి నియోజకవర్గంలో గల మియాపూర్ డివిజన్ కు చెందిన గూడా లావణ్య, గూడ శ్రీనివాస్ మరియు సీపీఎం, ఎం సిపి ఐ (యు) పార్టీల నుండి తెలంగాణ రక్షణ సేన పార్టీలోకి గ్రేటర్ హైదరాబాద్ అద్యక్షులు, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జీ వాసిలీ చంద్రశేఖర్ ప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ అధినేత కల్వకుంట్ల కవిత సమక్షంలో పార్టీ లో చేరారు. వీరి చేరికతో స్థానిక రాజకీయాల్లో ఒక ముఖ్యమైన పరిణామం ఏర్పడిందని. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో పార్టీ బలోపేతానికి మరియు క్షేత్రస్థాయిలో క్యాడర్‌ను విస్తరించడానికి ఇటువంటి చేరికలు దోహదపడతాయనీ వాసీలి చంద్రశేఖర్ ప్రసాద్ తెలిపాడు. ముందు ముందు మరిన్ని చేరికలు ఉంటాయని ఆయన తెలిపాడు. పార్టీలో కష్టపడి ప్రత్యేక గుర్తింపు, సేవలు కొనసాగిస్తామని చేరిన నాయకులు పేర్కొన్నారు. పార్టీ తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృ పాటు పడతామని తెలిపారు.

సర్వజ్ఞ సూపర్ కిడ్జ్ క్యాంపస్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

సంప్రదాయ దుస్తుల్లో పెద్ద ఎత్తున పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఉద్యమపోరు, ఖమ్మం, అక్టోబర్ 09 : ఖమ్మం నగరంలోని సర్వజ్ఞ సూపర్ కిడ్జ్ క్యాంపస్‌లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని, సంప్రదాయ వస్త్రధారణతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. ఈ వేడుకలకు సర్వజ్ఞ విద్యాసంస్థల చైర్మన్ ఆర్.వి. నాగేంద్ర కుమార్, డైరెక్టర్ నీలిమ హాజరై పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధించడం, పూలను పూజించడం, మహిళల ఐక్యతను చాటడం ఈ పండుగ ప్రత్యేకతలని వివరించారు.అదేవిధంగా చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీకగా దసరా పండుగను జరుపుకుంటామని తెలిపారు. సత్యం, ధర్మం, మంచితనం ఎల్లప్పుడూ విజయం సాధిస్తాయనే సందేశాన్ని దసరా పండుగ అందిస్తుందని పేర్కొన్నారు.చిన్నారులకు చిన్ననాటి నుంచే మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించడంతో పాటు వాటి పట్ల గౌరవభావాన్ని పెంపొందించేందుకు ఇటువంటి పండుగ వేడుకలు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. తల్లిదండ్రుల ఉత్సాహభరిత భాగస్వామ్యంతో క్యాంపస్‌లో బతుకమ్మ వేడుకలు ఆహ్లాదకర వాతావరణంలో ఘనంగా ముగిశాయి.

పదవులకోసం కాదు పనిచేసే వారికే ఓటు వేయండి

- మరోసారి ఎమ్మెల్సీ బరిలో అశోక్ సార్

- గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఫలితాలు తారుమారు చేసిన పాలకూరి అశోక్
- ఈసారి ఎన్నికల్లో విజయం నాదేనని ధీమా
- విలేకరుల సమావేశంలో వరంగల్-ఖమ్మం-నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి పాలకూరి అశోక్ సార్

ఉద్యమపోరు, ఖమ్మం, అక్టోబర్ 09 : పదవులకోసం కాదు పనిచేసే వారికే ఓటు వేయాలని,ఈసారి ఎన్నికల్లో విజయం నాదేనని వరంగల్–ఖమ్మం–నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి పాలకూరి అశోక్ సార్ అన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కొంతమంది రాత్రికి రాత్రే ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పుట్టుక వస్తున్నారని, అటువంటి తగిన గుణపాఠం చెప్పాలని, నిత్యం జనం కోసం పనిచేసే వారికే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని కోరారు.గత 12 సంవత్సరాలుగా నిరుద్యోగులకు నిధులు లేవు, నియామకాలు లేవు. ఇంటికో ఉద్యోగం లేదు, ఏడాదిలోగా రెండు లక్షల ఉద్యోగాలు లేవు. ఊకదంపుడు ఉపన్యాసాలు, 420 హామీలు తప్ప నిరుద్యోగులకు మిగిలింది శూన్యం అని అన్నారు. ప్రైవేటు ఉద్యోగాల్లో నాన్ లోకల్ కబ్జా అత్తెసరు ప్రభుత్వ ఉద్యోగాలు తెలంగాణలో నిరుద్యోగ భారతం. ప్రమాదప ుటంచున ప్రభుత్వ విద్య నెలకొని ఉందని అన్నారు.గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో 30 వేల మొదటి ప్రాధాన్యత ఓటు 90 వేల రెండో ప్రాధాన్యత ఓటు సాధించి బిఆర్ఎస్ ఓడిపోవడానికి తానే కారణమయ్యానని, ప్రధాన పార్టీలకు ముచ్చమటలు పట్టించానని అన్నారు. 90శాతం పైగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీలను కాదని కాంగ్రెస్ పార్టీ రెండు ఎమ్మెల్సీ స్థానాలను రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించి తెలంగాణ పిసిసి రెడ్డి కాంగ్రెస్ గా మారిందని అన్నారు. బిఆర్ఎస్ సైతం ఓసీలకే టికెట్లు కేటాయించడానికి ప్రయత్నం చేస్తుందని అదే జరిగితే ఆ రెండు పార్టీలను, బీసీలు 100 శాతం బొంద పెట్టడం ఖాయమని అన్నారు. ఓట్లు మావి సీట్లు మీవా అని ప్రశ్నించారు. రెండు పార్టీలు హైబ్రిడ్ మొక్కలను తెర మీదకి తెస్తున్నాయని, జన సంబంధం లేని వారు, తెలంగాణ అస్తిత్వం తెలియని వారు, డబ్బుల సంచులతో పోటీ చేయాలని చూస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ లో 42 శాతం స్థానాలు బీసీలకు కేటాయిస్తామని హామీ ఇచ్చి అసెంబ్లీలో కోర్టుల్లో నాటకలాడి బీసీలను నిండా ముంచిందని, ఇప్పుడు బీసీలకు సీట్లు కేటాయించడానికి అవకాశం ఉన్న ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. 10 శాతం కూడా లేని ఓసీలు 70 శాతం అసెంబ్లీని కబ్జా పెట్టారని అన్నారు. గత 15 ఏండ్లుగా నిరుద్యోగుల కోసం, తెలంగాణ సమాజం కోసం పనిచేసానని అటు బిఆర్ ఎస్ ఇటు కాంగ్రెస్ రెండు పార్టీలు 18 కేసులు పెట్టి ఎన్ని ఇబ్బందులకు గురి చేసిన నిరుద్యోగుల పక్షమే తప్ప ఏ ప్రభుత్వానికి అంట కాగలేదని, ప్రాణాలు ఫణంగా పెట్టి మూడు సార్లు ఆమరణ నిరాహార దీక్షలు చేసానని, లక్షల మందికి తన ఆన్‌లైన్ పాఠాల ద్వారా తక్కువ ఫీజుతో, ఉచితంగా పాఠాలు భోదించానని అన్నారు. నిరుద్యోగుల పక్షాన నడి రోడ్డుపై నిలబడి పోలీసుల దిగ్భంధాలు చేధించుకుంటూ, నిత్యం కోర్టు మెట్లు ఎక్కుతు నిలబడి గొంతు ఎత్తానని నిరుద్యోగులు, బిసిలు, ఎస్‌సి, ఎస్టీ, మైనార్టీలు అండగా నిలబడతారని అన్నారు. ఏడాదిలోగా రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని కేవలం 13 వేల ఉద్యోగాలు ఇచ్చి 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని అబద్దాలు చెబుతుందని, నిరుద్యోగులను నిండా ముంచిన పార్టీ కాంగ్రెస్ అని విమర్శించారు. రెండు గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఉద్యోగులు కాంగ్రెస్ పార్టీని పాతంలోకి తొక్కుతారని విమర్శించారు. తెలంగాణ బిడ్డలకు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల కల్పన తన ఎన్నికల నినాదంని ప్రకటించారు. గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 ఉద్యోగాల ప్రకటన ఇచ్చిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. పవర్ సెక్టార్ లో 5300 ఉద్యోగాలతో ఆర్థిక శాఖ ఆమోదం పొందిన ఇంతవరకు నోటిఫికేషన్ ఇవ్వలేదనీ అన్నారు. 25 వేల ఉద్యోగాలతో మెగా డిఎస్సిని ఉద్యోగ క్యాలెండర్లో ప్రకటించినా ఇప్పటివరకు దిక్కు లేదన్నారు. సర్కారు బడిని బాగు చేస్తామని రేవంత్ రెడ్డి ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప ఏమీ లేదన్నారు. 33 జిల్లాలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి నిరుద్యోగులను ఉద్యోగులుగా మార్చాలని డిమాండ్ చేశారు. పేరుకే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని, తెలంగాణ అస్తిత్వంను ఆంధ్రుల గుప్పెట్లో పెట్టారని భౌగోళిక తెలంగాణ తప్ప సామాజిక తెలంగాణ సాధ్యం కాలేదని, తెలంగాణ ఉన్నత కులాల చేతిలో బందీ అయ్యిందని, ఎస్సీ ఎస్టీ, బిసి వర్గాల్లో చైతన్యం ఓటు రూపంలో వచ్చినప్పుడే సాధ్యమవుతుందని అన్నారు. బీసీలందరూ ఐక్యమైనప్పుడే మనకు న్యాయం జరుగుతుంది. ఈ ఊడిగం ఇంకా ఎన్నాళ్లు అని ప్రశ్నించారు. మేమెంతో మాకంత నినాదంతో చేతులు బిగించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో సోషల్ జస్టిస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.వి గౌడ్, ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర నాయకులు బానోతు భద్రు నాయక్ , నాగరాజు, జి. వెంకటనారాయణ, ప్రణీత్, కృష్ణ,బి రమేష్,డి ఉదయ్ సింగ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

వెన్నవల్లి గుట్ట మట్టి తరలింపుతో గ్రామానికి ఒరిగిందేమిటి...?

- కాంట్రాక్టర్లు గ్రామ పంచాయతీకి నిధులు చెల్లించారా?
- గ్రామాభివృద్ధికి చేసిన పనులెక్కడ?
- ప్రజల్లో వెల్లువెత్తుతున్న సందేహాలు!

ఉద్యమపోరు, ఖమ్మం, అక్టోబర్ 09 : ఖమ్మం జిల్లా, కల్లూరు మండలం వెన్నవల్లి గ్రామ పరిధిలోని గుట్ట నుంచి ఏళ్ల తరబడి మట్టి తరలింపు జరుగుతున్న నేపథ్యంలో గ్రామ ప్రజల్లో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గుట్ట నుంచి భారీ వాహనాల ద్వారా మట్టిని తరలిస్తున్న సంబంధిత కాంట్రాక్టర్లు లేదా భూమి యజమానులు గ్రామ పంచాయతీకి ఏమైనా నిధులు చెల్లించారా? చెల్లించి ఉంటే ఆ నిధులను గ్రామాభివృద్ధికి వినియోగించారా? అనే ప్రశ్నలు స్థానికంగా చర్చనీయాంశంగా మారుతున్నాయి.మట్టి తరలింపు జరుగుతోంది, గ్రామానికి ప్రయోజనం ఏమిటి? అనే సందేహం కలగమానదు. వెన్నవల్లి గుట్ట నుంచి గత కొన్నేళ్లుగా మట్టి తరలింపు జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మట్టి తరలింపునకు సంబంధించి ప్రభుత్వానికి ఏ మేరకు ఆదాయం సమకూరింది? సంబంధిత అనుమతులు, నిబంధనల ప్రకారం చెల్లించాల్సిన రుసుములు చెల్లించారా? గ్రామపంచాయతీకి ఏమైనా నిధులు అందాయా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. గుట్ట నుంచి మట్టి తరలింపు ద్వారా సంబంధిత వ్యక్తులకు ఆర్థిక ప్రయోజనం కలుగుతున్నట్లయితే, అదే సమయంలో గ్రామానికి ఎలాంటి ప్రయోజనాలు చేకూరాయి? గ్రామ ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుద్ధ్యం, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఏమైనా చర్యలు తీసుకున్నారా? అనే ప్రశ్నలను గ్రామస్తులు లేవనెత్తుతున్నారు.––– గ్రామపంచాయతీ ఆదాయం, అభివృద్ధి పనుల వివరాలేవి?మట్టి తరలింపునకు సంబంధించి గ్రామపంచాయతీకి ఏవైనా నిధులు అందినట్లయితే వాటి వివరాలను బహిర్గతం చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఏ సంవత్సరంలో ఎంత మొత్తం అందింది? ఆ నిధులను ఏ ఖాతాలో జమ చేశారు? వాటితో గ్రామంలో ఎక్కడెక్కడ అభివృద్ధి పనులు చేపట్టారు? పనుల కోసం ఎంత ఖర్చు చేశారు? అనే వివరాలను అధికారిక రికార్డుల ఆధారంగా వెల్లడించాల్సిన అవసరం ఉంది.ఒక వేళ గ్రామపంచాయతీకి ఎలాంటి నిధులు అందకపోతే ఆ విషయాన్ని కూడా అధికారులు స్పష్టం చేయాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. మట్టి తరలింపునకు సంబంధించిన ప్రభుత్వ రుసుములు, గ్రామపంచాయతీకి అందే నిధులు వేర్వేరు అంశాలు కావడంతో వాటి వివరాలను విడివిడిగా వెల్లడించాల్సి ఉంది.రహదారులు, పంటల నష్టంపై స్పందించేది ఎవరు?భారీ టిప్పర్లు, ట్రాక్టర్ల రాకపోకల వల్ల రహదారులు దెబ్బతింటున్నాయని, దుమ్ము కారణంగా సమీప వ్యవసాయ భూముల్లో పంటలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? రహదారుల మరమ్మతులకు నిధులు కేటాయించారా? పంట నష్టంపై ఏమైనా పరిశీలన జరిపారా? అనే అంశాలపై కూడా సమాధానాలు రావాల్సి ఉంది.––– అధికారుల వివరణ కోసం ఎదురుచూపులు వెన్నవల్లి గుట్ట మట్టి తరలింపునకు సంబంధించి గ్రామపంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ అధికారులు, గనులు, భూగర్భ శాఖ అధికారులు వాస్తవాలను వెల్లడించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. మట్టి తరలింపునకు ఉన్న అనుమతులు, ప్రభుత్వానికి చేసిన చెల్లింపులు, గ్రామ పంచాయతీకి అందిన నిధులు, చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను పరిశీలించి ప్రజలకు తెలియజేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.గుట్ట నుంచి మట్టి తరలింపు జరుగుతున్నప్పుడు గ్రామానికి వచ్చిన ఆదాయం ఎంత? ఆ ఆదాయంతో గ్రామంలో జరిగిన అభివృద్ధి ఏమిటి? ప్రజలకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలేమిటి? అనే ప్రశ్నలకు సంబంధిత శాఖలు అధికారిక రికార్డుల ఆధారంగా సమాధానాలు వెల్లడించాల్సిన అవసరం ఉంది.ప్రజలు వ్యక్తం చేస్తున్న ఈ సందేహాలపై సంబంధిత అధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడిస్తారా? గ్రామాభివృద్ధికి సంబంధించిన లెక్కలను ప్రజల ముందుంచుతారా? అన్నది వేచి చూడాలి మరి.

సమాచార హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

- అదనపు కలెక్టర్ వి.భుజంగరావు

ఉద్యమపోరు, నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 09 : సమాచార హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ వి.భుజంగరావు సూచించారు.సమాచార హక్కు చట్టం వారోత్సవాలను పురస్కరించుకుని హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమాన్ని నిజామాబాద్ కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ నేతృత్వంలో ఆయా శాఖల అధికారులు ఎల్.సీ.డీ తెరపై ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు.సమాచార హక్కు చట్టం అమలు ఆవశ్యకతపై రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా,ఇతర అతిథుల ప్రసంగాలను ఆలకించారు.ఆర్.టి.ఐ అమలుపై చేయించిన ప్రతిజ్ఞలో అన్ని శాఖల పీఐఓలు,ఏపీఐఓలు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు.సమాచార హక్కు చట్టాన్ని గౌరవిస్తూ,పౌరులు కోరిన సమాచారాన్ని సకాలంలో అందిస్తామని,స్వచ్ఛందంగా ఇవ్వవలసిన సమాచారాన్ని పౌరులకు అందుబాటులో ఉండేలా వ్యవహరిస్తామని,పనితీరులో పారదర్శకతను,జవాబుదారీతనాన్ని పాటిస్తూ పని చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా సమాచార చట్టాన్ని పక్కాగా అమలు చేస్తూ,నిజామాబాద్ జిల్లాకు కూడా అవార్డులు సాధించి ప్రత్యేక గుర్తింపు తేవాలని అదనపు కలెక్టర్ సూచించారు.నిర్ణీత గడువు లోపు సమాచారాన్ని అందిస్తూ,రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలన్నారు.లేనిపక్షంలో అప్పీలేట్ అథారిటీ చేపట్టే చర్యలకు గురి కావాల్సి వస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి గీత,కలెక్టరేట్ ఏ.ఓ బాలరాజు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూ పునఃసర్వే పారదర్శకంగా చేపట్టాలి

- పొన్నాల గ్రామంలో పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

ఉద్యమపోరు, శామీర్‌పేట, అక్టోబర్ 09 : భూ పునఃసర్వే పనులను ఎలాంటి తప్పులకు తావులేకుండా, పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతులు, భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.శుక్రవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలం పొన్నాల గ్రామంలో కొనసాగుతున్న భూ పునఃసర్వే పనులను అదనపు కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే పురోగతిని, అధికారులు చేపడుతున్న చర్యలను సమీక్షించారు.భూముల హద్దులకు సంబంధించి భవిష్యత్తులో ఎలాంటి వివాదాలు తలెత్తకుండా భూ రికార్డులను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. సర్వేలో ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, తప్పులు లేకుండా నమోదు చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా నిర్ణీత సమయంలో సర్వే పనులను పూర్తి చేసేందుకు రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో శామీర్‌పేట తహసీల్దార్ సీహెచ్ శ్రీనివాస్, మండల సర్వేయర్ మహేందర్, మండల రెవెన్యూ పరిశీలకుడు భానుచందర్, గ్రామ పాలన అధికారి ప్రసన్న, ఇతర రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి వేళ ఆపన్నహస్తం..

ప్రమాద బాధితుడికి భాస్కర్ నాయక్ భరోసా!

- మానవత్వంతో స్పందించి వైద్య ఖర్చులకు రూ.10 వేల ఆర్థిక సాయం

ఉద్యమపోరు, జడ్చర్ల, అక్టోబర్ 09 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితుడికి స్వచ్ఛంద సేవకుడు, సామాజిక కార్యకర్త జర్పుల భాస్కర్ నాయక్ ఆపన్న హస్తం అందించారు. అర్ధరాత్రి సమయంలో ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే స్పందించి, బాధితుడి వైద్య ఖర్చుల కోసం రూ.10,000 ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. జడ్చర్ల మండలం అల్వాల్‌పల్లి గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు శివ గౌడ్ బైక్‌పై గ్రామం నుంచి ప్రధాన రహదారిపైకి వస్తుండగా, హైవేపై మరోవైపు నుంచి వేగంగా వచ్చిన కియా కారు ఆయన బైక్‌ను ఢీకొట్టినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో శివ గౌడ్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన గ్రామస్థులు వెంటనే స్పందించి, 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అనంతరం అంబులెన్స్‌లో ఆయనను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కారును పోలీస్‌స్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నించినట్లు గ్రామస్థులు తెలిపారు. అయితే, ఈ ఘటన నేపథ్యంలో సర్పంచ్‌తో పాటు కొందరు గ్రామస్థులు అక్కడే ఉండి పరిస్థితిని పరిశీలించారు.

అర్ధరాత్రి ఫోన్.. వెంటనే స్పందన

ప్రమాదంలో గాయపడిన శివ గౌడ్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అవసరమని గుర్తించిన గ్రామ సర్పంచ్ రాగుల రమేష్ అర్ధరాత్రి సుమారు 12 గంటల సమయంలో జర్పుల భాస్కర్ నాయక్‌కు ఫోన్ చేసి ప్రమాద వివరాలను తెలియజేశారు. విషయం తెలుసుకున్న భాస్కర్ నాయక్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా స్పందించి, బాధితుడి వైద్య ఖర్చుల కోసం రూ.10,000 ఆర్థిక సాయం అందించారు.ఆపదలో ఉన్న వ్యక్తికి అండగా నిలవాలనే ఉద్దేశంతో, సమయం సందర్భం చూడకుండా తక్షణ సహాయం అందించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి చికిత్స అందించేందుకు ఆర్థికంగా తోడ్పాటు అందించడం ద్వారా భాస్కర్ నాయక్ తన సేవా దృక్పథాన్ని చాటుకున్నారని పేర్కొన్నారు.

సేవే లక్ష్యం.. ఆపదలో ఉన్నవారికి అండగా

సమాజంలో ఎవరికి ఆపద వచ్చినా తమ వంతు సహాయం అందించేందుకు ముందుండే వ్యక్తులు ఎంతో అవసరమని ఈ ఘటన మరోసారి చాటిచెప్పింది. ప్రమాదా లు, అనారోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న కుటుంబాలకు అండగా నిలవడం ద్వారా బాధితుల్లో ధైర్యాన్ని నింపవచ్చని పలువురు అభిప్రాయపడ్డారు. అల్వాల్‌పల్లి గ్రామానికి చెందిన శివ గౌడ్ రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలియగానే జర్పుల భాస్కర్ నాయక్ స్పందించి ఆర్థిక సాయం అందించడం పట్ల గ్రామ సర్పంచ్, మరియు రాగుల రమేష్‌తో పాటు గ్రామస్థులు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆపద సమయంలో బాధితుడికి అండగా నిలిచిన ఆయన సేవాభావాన్ని కొనియాడారు.ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, అవసరమైన సమయంలో ఆదుకోవడం వంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వాన్ని పెంపొందిస్తాయని ఈ ఘటన మరోసారి నిరూపించింది..

ఘనంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు..

ఉద్యమ పోరు, నడికూడ, అక్టోబర్ 09 : నడికూడ మండలం ముస్త్యాలపల్లి ప్రాథ మికోన్నత పాఠశాలలో ముందస్తు బతు కమ్మ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వ హించారు. ఈ వేడుకకు పెద్ద సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు హాజరై పండు గ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భం గా "మన పండుగలు – మన సంస్కృతి – మన సంప్రదాయాలు" అనే అంశంపై తల్లులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. బతుకమ్మ పండుగ విశిష్టతను తెలియజేస్తూ, తెలం గాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్ష ణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కా వాలని సూచించారు. మన పండుగలు కేవలం సంబరాలకే పరిమితం కాకుండా, మన సంస్కృతికి, సామాజిక ఐక్యతకు, ప్రకృతితో మనకున్న అనుబంధానికి ప్రతీ కలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కందుకూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల ప్రాముఖ్యతను భావితరాలకు తెలియ జేయడం, పిల్లల్లో మన సంప్రదాయాల పట్ల గౌరవభావాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపా రు. పాఠశాల విద్యతో పాటు సాంస్కృతిక విలువలను విద్యార్థులకు పరిచయం చేయడంలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని ఉపాధ్యా యులు పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లి దండ్రులు ఉత్సాహంగా పాల్గొనడంతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావర ణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు కందుకూరి శ్రీని వాస్, ఉపాధ్యాయులు పావని, సత్యపా ల్, స్వరూపరాణి, తదితరులు పాల్గొ న్నారు.

నిర్దవెల్లి ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు..

విద్యార్థులకు నగదు బహుమతులు

ఉద్యమపోరు, కేశంపేట, అక్టోబర్ 09 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలను కేశంపేట మండలం నిర్దవెల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో సందడి చేశారు. పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది.తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు పండుగల ప్రాముఖ్యతను చిన్ననాటి నుంచే తెలియజేయడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. అనంతరం అందంగా బతుకమ్మలను రూపొందించిన విద్యార్థులను అభినందించి, వారికి నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించడంతో పాటు సంప్రదాయ పండుగల పట్ల ఆసక్తిని పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.ఈ

కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ సపురా అమీర్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు బడ్క మల్లయ్య, వార్డు సభ్యులు చంద్రయ్య, రిజ్వాన బేగం, మోహిజ్, కాంగ్రెస్ యువ నాయకుడు రాజేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే ఖాజా, మల్లేష్, ప్రవీణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్ స్కూల్లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- స్కూల్ ప్రిన్సిపల్ లక్ష్మి తులసి

ఉద్యమపోరు, ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 09 : యాచారం మండల పరిధిలోని శుక్రవారం మాల్ పట్టణంలోనీ బచ్చన్ స్కూల్లో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిపారు. సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మి తులసిమాట్లాడుతూ, బచ్చన్ స్కూల్ ప్రత్యేకతను గుర్తు చేశారు.ఈ చిన్నారులు బతుకమ్మ ఆడడం మాకెంతో సంతోషంగా ఉందని అన్నారు. బచ్చన్ స్కూల్ అంటేనే చిన్నారుల నిలయంగా మనం చెప్పుకోవచ్చు అన్నారు. బతుకమ్మ సంబరంలో చిన్నారులు పాల్గొనడం తల్లిదండ్రులను కూడా ముద్దమంత్రునీ చేసిందని అన్నారు. ఇలాంటివి బచ్చన్ స్కూల్లో మరిన్ని ఎన్నో కార్యక్రమాలు విద్యార్థుల చేత చేపిస్తామని యాజమాన్యం దీనికి ఎంతగానో సహకరిస్తుందని బచ్చన్ మరింత ఎదుగుతుందని ఈ ఎదుగుదలకు చిన్నారులు, విద్యార్థులే తల్లిదండ్రులు,ఉపాధ్యాయ ఉపాధ్యాయులు బచ్చన్ స్కూలు అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతారని ఆమె అన్నారు.ఉపాధ్యాయులు పిల్లలు ఎంతో ఆనందంగా ఆప్యాయంగా బతుకమ్మ ఆడారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్షి తులసి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

– జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి, ఐపీఎస్

- సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి..
- మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఉద్యమపోరు, మహబూబ్‌నగర్, అక్టోబర్ 09 : ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన విద్యార్థుల సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి, ఐపీఎస్ గారు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ.. విద్యార్థులు తమ జీవితంలో స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని, క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులు తమ పరిస్థితులను చూసి నిరుత్సాహపడకుండా, అందుబాటులో ఉన్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వృత్తి విద్యా కోర్సుల ద్వారా సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకొని, ప్రాక్టికల్ శిక్షణను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి వారికి గర్వకారణంగా నిలవాలని, నిజాయితీ, మంచి నడవడిక, క్రమశిక్షణను జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ గారు సూచించారు. గుర్తుతెలియని లింకులను క్లిక్ చేయడం, ఓటీపీలు, బ్యాంకు వివరాలు, పాస్‌వర్డ్‌లను ఇతరులకు తెలియజేయడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని, పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో జరిగే ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే విద్యార్థులు గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, చెడు స్నేహాలకు లోనుకాకుండా తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని తెలిపారు. మత్తు పదార్థాల వినియోగం, సరఫరా, అక్రమ రవాణా వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే భవిష్యత్తు దెబ్బతినడంతో పాటు కుటుంబ గౌరవానికి కూడా భంగం కలుగుతుందని హెచ్చరించారు. విద్యార్థులు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగి తమ కుటుంబానికి, కళాశాలకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థుల్లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో రూపొందించిన సైబర్ నేరాల అవగాహన పోస్టర్‌ను జిల్లా ఎస్పీ గారు ప్రదర్శించారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ మున్సిఫల్ మేయర్ శ్రీమతి గుమ్మాల మమత, టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఇజాజ్ఉద్దీన్, WPS ఇన్స్పెక్టర్ కృష్ణయ్య, కళాశాల ప్రిన్సిపల్ జంగయ్య, సైబర్ క్రైమ్ సబ్ ఇన్స్పెక్టర్ శ్రావణ్ కుమార్, టూ టౌన్ PS సబ్ ఇన్స్పెక్టర్లు, కార్పొరేటర్ ప్రవీణ్ కుమార్, 1400 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ పబ్లిక్ స్కూల్ - జూనియర్ కళాశాలను పరిశీలన

- తెలంగాణ రాష్ట్రం విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్
- జిల్లా అధికారి డీఈవో వెంకటేశ్వర్లు

ఉద్యమపోరు, ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 09 : మంచాల మండల పరిధిలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, కళాశాలలను,తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఐఏఎస్ శుక్రవారం తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంచాలను సందర్శించనైనది.పాఠశాల ప్రాంగణంలో కళాశాల ప్రాంగణంలో జరుగుతున్నటువంటి అభివృద్ధి పనులను పరిశీలించనైనది.నవంబర్ నెలలో పాఠశాలను ప్రారంభించడానికి ముఖ్యమంత్రి విచ్చేయుచున్నారని తెలియజేయునైనది.పనులను వేగవంతం చేయడం కొరకు తల్లిదండ్రుల కమిటీ నుండి సబ్ కమిటీలు వేయడం జరిగింది.ప్రణాళిక ప్రకారం పాఠశాల తరగతి గదులు,కళాశాల ప్రాంగణాన్ని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించినైనది.కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డీఈవో వెంకటేశ్వర్లు, ఓ ఎస్ డి తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ జీనత్,ఈఈ రామ్ కుమార్,నాగర్ కర్నూల్ డిఇఓ,మంచాల మండల విద్యాధికారి రాందాస్ , ఎమ్మార్వో ఎం,వి,వి,ఎస్ ప్రసాద్,పాఠశాల ఇంచార్జ్ ప్రధాన ఉపాధ్యాయులు వాణి,నోడల్ ఆఫీసర్ కిషన్ చౌహన్ టి పి ఎస్ ఆరుట్ల ప్రధానోపాధ్యాయులు గిరిధర్ గౌడ్,నాగర్ కర్నూలు జిల్లా వంగూరు పోల్కంపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు అధికారులు, మంచాల పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు బాల్రాజ్, లింగం,సురేష్, వెంకటేష్, సుధాకర్, విజయలక్షి ,రాణి,శ్రీనివాస్ రెడ్డి,పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వస్పుల జడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు

ఉద్యమపోరు, మిడ్జిల్, అక్టోబర్ 09 : మండల పరిధిలోని వస్పుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మలను పేర్చి, బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని విద్యార్థులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించారు. అనంతరం బతుకమ్మ పాటలు పాడుతూ, పండుగ విశిష్టతను చాటిచెప్పారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి వేడుకల్లో పాల్గొనడంతో పాఠశాల ఆవరణ సందడిగా మారింది.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు విద్యార్థుల్లో వాటి పట్ల అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు.విద్యతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధించిన పండుగల విశిష్టతను విద్యార్థులకు తెలియజేయడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ పండుగ ప్రాముఖ్యతను చాటిచెప్పారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య, ఉపాధ్యాయులు తారా సింగ్, నిమ్మయ్య, సలీం తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పదేళ్ల పాలన దశాబ్ది ఉత్సవాలు

తెలంగాణలో స్వర్ణయుగానికి కేసీఆర్ పాలన నాంది: జీవన్ రెడ్డి

ఉద్యమపోరు, నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 09 : తెలంగాణ రాష్ట్ర సాధకుడు,మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రం అభివృద్ధి,సంక్షేమ రంగాల్లో గణనీయమైన ప్రగతి సాధించిందని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు,ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి అన్నారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు శుక్రవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కేసీఆర్ దశాబ్ది పాలన ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ పాలన తెలంగాణలో స్వర్ణయుగానికి నాంది పలికిందని,ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై విమర్శలు చేశారు.కేసీఆర్ హయాంలో కొత్త జిల్లాలు,మండలాలు,సమీకృత కలెక్టరేట్లు,మిషన్ భగీరథ,రైతుబంధు,రైతుబీమా,24 గంటల ఉచిత విద్యుత్,సాగునీటి ప్రాజెక్టులు,ఆసరా పెన్షన్లు,కల్యాణలక్ష్మి ,షాదీముబారక్ వంటి పథకాలతో ప్రజలకు ప్రయోజనం చేకూరిందని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర రూపురేఖలను మార్చిన కేసీఆర్ పాలన మళ్లీ రావాలని,పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి,కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న జేఏసీ నాయకులు,ఉద్యమకారులతో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను ఘనంగా సన్మానించారు.కేసీఆర్ పదేళ్ల పాలనలో నిజామాబాద్ జిల్లాలో జరిగిన అభివృద్ధిని ఫ్లెక్సీలు,కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి,ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేశ్ గుప్తా,బాజిరెడ్డి గోవర్ధన్,షకీల్ ఆమేర్,మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్,మాజీ జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు,బాజిరెడ్డి జగన్,మాజీ మేయర్ నీతూ కిరణ్ తదితర బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

కాకతీయ పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక... ప్రిన్సిపాల్ ప్రదీప్ రెడ్డి...

ఉద్యమపోరు, మంథని, అక్టోబర్ 09 : మంథని పట్టణంలోని కాకతీయ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. దసరా సెలవుల నేపథ్యంలో విద్యార్థులు ముందుగానే పండుగ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, బతుకమ్మ పాటలు ఆలపిస్తూ, దాండియా నృత్యాలతో సందడి చేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ.. భారతీయ పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాల ఔన్నత్యాన్ని చాటిచెబుతాయని అన్నారు. తెలంగాణ సంస్కృతి లో బతుకమ్మ పండుగకు విశిష్టమైన స్థానం ఉందని, ప్రకృతిలో లభించే పూలను పూజించే ఈ పండుగ తెలంగాణ ప్రజల జీవనశైలి, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. భావితరాలకు మన సంప్రదాయాల గొప్పదనాన్ని తెలియజేయడంలో ఇటువంటి వేడుకలు దోహదపడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ స్వగ్రామాల్లో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి బతుకమ్మ, దసరా పండుగలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థు లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ : ఎంఈఓ గడ్డం మంజుల

ఉద్యమపోరు, కరకగూడెం, అక్టోబర్ 09 : కరకగూడెం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ గడ్డం మంజుల ఆధ్వర్యంలో దసరా పండుగను పురస్కరించుకొని బతుకమ్మ సంబరాలను గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చారు. బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటలాడుతూ పండుగ వాతావరణాన్ని సృష్టించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగ విశిష్టతను ఎంఈఓ మంజుల వివరించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ ఆడబిడ్డల అతి పెద్ద పండుగ బతుకమ్మ అని, ప్రకృతిలో లభించే పూలతో బతుకమ్మను పేర్చి ప్రకృతిని ఆరాధించడం ఈ పండుగ ప్రత్యేకత అని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు మన సంస్కృతి సంప్రదాయాలను తెలుసుకోవాలని సూచించారు.విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మల చుట్టూ కోలాటం

వేస్తూ చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాల ఆవరణం అంతా పూలతో, విద్యార్థుల కేరింతలతో పండుగ శోభను సంతరించుకుంది.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళల జోలికొస్తే కఠిన చర్యలు తప్పవు!

- సెప్టెంబర్‌లో షీ టీమ్స్‌కు 215 ఫిర్యాదులు.. 198 మంది పట్టివేత
- మహిళలు, బాలికలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలి: మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి

ఉద్యమపోరు, మల్కాజిగిరి కమిషనరేట్, అక్టోబర్ 09 : మహిళలు, బాలికలను వేధించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి ఐపీఎస్ స్పష్టం చేశారు. వేధింపులకు గురైన మహిళలు, బాలికలు భయపడకుండా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళల భద్రతే లక్ష్యంగా షీ టీమ్స్ నిరంతరం పనిచేస్తున్నాయని తెలిపారు.బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, ప్రజా రవాణా బస్సులు, పాఠశాలలు, కళాశాలలు, కూరగాయల మార్కెట్లు తదితర రద్దీ ప్రాంతాల్లో సాధారణ దుస్తుల్లో నిఘా ఉంచి ఆకతాయిల ఆట కట్టిస్తున్నట్లు వెల్లడించారు. మహిళలను వేధించే వారిని ఆధారాలతో పట్టుకుని న్యాయస్థానాల ముందు హాజరుపరచడంతోపాటు, అవసరమైన వారికి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నెల రోజుల్లో 198 మంది పట్టివేత

మహిళా భద్రత విభాగం డీసీపీ పర్యవేక్షణలో ఎల్బీనగర్‌లోని పోలీస్ కమిషనర్ క్యాంపు కార్యాలయంలో వేధింపులకు పాల్పడిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో షీ టీమ్స్ 198 మందిని పట్టుకున్నాయి. వీరిలో 167 మంది మేజర్లు, 31 మంది మైనర్లు ఉన్నారు. కుటుంబ సభ్యుల సమక్షంలో వృత్తిపరమైన కౌన్సెలర్ల సహకారంతో కౌన్సెలింగ్ నిర్వహించారు.

215 ఫిర్యాదులు.. 16 క్రిమినల్ కేసులు

సెప్టెంబర్ నెలలో మహిళల వేధింపులకు సంబంధించి మొత్తం 215 ఫిర్యాదులు అందినట్లు పోలీసులు వెల్లడించారు. వాటిలో ఫోన్ కాల్స్ ద్వారా వేధింపులకు సంబంధించి 59, సామాజిక మాధ్యమాల ద్వారా 68, ప్రత్యక్షంగా లేదా భౌతికంగా వేధింపులకు సంబంధించి 88 ఫిర్యాదులు వచ్చాయి.ఫిర్యాదులపై స్పందించిన షీ టీమ్స్ 16 క్రిమినల్ కేసులు నమోదు చేయగా, 66 పెట్టీ

కేసులు నమోదు చేశాయి. మరో 133 మందికి కౌన్సెలింగ్ నిర్వహించాయి.

వ్యక్తిగత చిత్రాలతో బెదిరింపులు.. కటకటాల్లోకి నిందితులు

వివాహిత మహిళను గత పరిచయంతో వేధిస్తూ, ఆమె వ్యక్తిగత చిత్రాలు, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పెడతానని బెదిరించిన వ్యక్తిపై షీ టీమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టింది.ఇన్‌స్టాగ్రామ్ ద్వారా మైనర్ బాలికను పరిచయం చేసుకుని అసభ్యకరమైన చిత్రాలు పంపాలని ఒత్తిడి చేయడంతో పాటు, సికింద్రాబాద్‌కు రావాలని కోరిన వ్యక్తిపై బీఎన్ఎస్, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసి న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. మరో ఘటనలో మైనర్ బాలికను కాఫీ షాప్‌కు తీసుకెళ్లి ఆమె అనుమతి లేకుండా ఫొటోలు, వీడియోలు తీసి, వాటిని తల్లిదండ్రులకు పంపుతానని బెదిరించిన యువకుడిపై కూడా కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. బాలికను వెంటాడుతూ, ఫోన్ కాల్స్‌తో వేధించడం, ఇన్‌స్టాగ్రామ్‌లో ఫొటోలు పోస్టు చేయడం వంటి ఆరోపణలపైనా చర్యలు తీసుకున్నారు.ఇక తనతో సంబంధాన్ని కొనసాగించకపోతే వ్యక్తిగత చిత్రాలను బయటపెడతానని బెదిరించిన వ్యక్తితోపాటు, ప్రేమ ప్రతిపాదనను తిరస్కరించిన యువతిని ఫోన్ కాల్స్, సందేశాలతో వేధిస్తూ బ్లాక్‌మెయిల్ చేసిన మరో వ్యక్తిపై కూడా కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.ఒంటరిగా నివసిస్తున్న వితంతువును వెంటాడుతూ, ఆమె పని చేసే ప్రాంతానికి వెళ్లి వేధించిన వ్యక్తిపై కూడా షీ టీమ్ ఫిర్యాదు మేరకు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

33 వేల మందికి అవగాహన

సెప్టెంబర్ నెలలో మల్కాజిగిరి షీ టీమ్స్ 192 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సుమారు 33,118 మందికి మహిళల హక్కులు, చట్టాలు, నేరాలు, భద్రతా జాగ్రత్తలపై అవగాహన కల్పించాయి. మెట్రో రైళ్లలో మహిళల కోసం కేటాయించిన బోగీల్లో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది పురుషులను గుర్తించి, మెట్రో అధికారుల ద్వారా జరిమానాలు విధించినట్లు వెల్లడించారు.వేధింపులకు గురైతే సంప్రదించండిమహిళలు, బాలికలు వేధింపులకు గురైతే మల్కాజిగిరి షీ టీమ్స్ వాట్సాప్ నంబర్ 8712662111కు ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు.

ప్రాంతాల వారీగా సంప్రదించాల్సిన నంబర్లు:

బేగంపేట్: 8712665300
జవహర్‌నగర్: 8712662601
ఎల్బీనగర్: 8712662602
మల్కాజిగిరి: 8712662603
మేడిపల్లి: 8712662600
ఉప్పల్: 8712665299
వనస్థలిపురం: 8712662604

ఈ కార్యక్రమంలో మహిళా భద్రత విభాగం ఏసీపీ పి.వెంకటేశ్వర్లు, ఇన్‌స్పెక్టర్ జి.అంజయ్య, అడ్మిన్ ఎస్ఐ జి.రంగారెడ్డి, షీ టీమ్స్ సిబ్బంది, కౌన్సెలర్లు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్ రాజాగౌడ్

ఉద్యమపోరు, నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 09 : నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ గా (రెవెన్యూ) రాజాగౌడ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్ కు చేరుకుని బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు అదనపు కలెక్టర్ కు స్వాగతం పలికి,పరిచయం చేసుకున్నారు.నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ గా కొనసాగిన ఎస్.కిరణ్ కుమార్ పదవీ విరమణ చేయగా,ఆయన స్థానంలో జగిత్యాల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా కొనసాగుతున్న రాజాగౌడ్ ను నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా ప్రభుత్వం ఇటీవలే పోస్టింగ్ కల్పించింది.ఈ మేరకు ఆయన శుక్రవారం ఇక్కడికి చేరుకుని బాధ్యతలు స్వీకరించారు.అంతకుముందు ఆయన మర్యాదపూర్వకంగా కలెక్టర్ ఇలా త్రిపాఠిని కలిసారు.స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భుజంగరావు,డీఆర్ఓ గీత,కలెక్టరేట్ ఏ.ఓ బాలరాజు,కార్యాలయ సిబ్బంది,వివిధ శాఖల అధికారులు అదనపు కలెక్టర్ ను బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కలిసి స్వాగతం పలికారు.కాగా అదనపు కలెక్టర్ రాజాగౌడ్ ఇదివరకు నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలోని బాన్సువాడ,బోధన్,ఆర్మూర్ లలో రెవెన్యూ డివిజనల్ అధికారిగా (ఆర్.డీ.ఓ)గా విధులు నిర్వర్తించారు.

అంగడిపేట్ ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఘనంగా అన్నదానం

ఉద్యమపోరు, గజ్వేల్, అక్టోబర్ 09 : సిద్దిపేట జిల్లా గజ్వేల్ పరిధిలోని అంగడిపేట్ శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో పితృపక్షాల సందర్భంగా శుక్రవారం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ సేవా కార్యక్రమానికి దొంతుల సత్యనారాయణ – మేఘమాల దంపతులు, దొంతుల యాదగిరి – లక్ష్మీ దంపతులు, వారి కుటుంబ సభ్యులతో పాటు అత్తెల్లి నాగేందర్ – వసంత దంపతులు మరియు వారి కుటుంబ సభ్యులు ముఖ్య దాతలుగా వ్యవహరించి, అన్నదానాన్ని దగ్గరుండి జరిపించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, మాజీ కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, కొమురవెల్లి ఆలయ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ, ప్రముఖ వైద్యులు డాక్టర్ లింగం తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో అన్నదానం అన్ని దానాల కంటే మిన్నయైన మహాదానమని కొనియాడారు. ముఖ్యంగా పితృపక్ష పుణ్యదినాల్లో ఇటువంటి అన్నదాన, సేవా కార్యక్రమాలు నిర్వహించడం వల్ల పితృదేవతల ఆశీస్సులు లభించడంతో పాటు ఎనలేని పుణ్యం దక్కుతుందని పురాణాలు చెబుతున్నాయని పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమాల్లో పాల్గొంటూ, సేవా భావాన్ని చాటుకుంటున్న ప్రతి ఒక్కరికీ ఆ దేవుని అనుగ్రహం ఎల్లప్పుడూ ఉంటుందని వారు ఆకాంక్షించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులు, స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

రైతుల ప్రయోజనానికే భూముల రీసర్వే

- కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి
- ఫతేపూర్ లో నిర్వహిస్తున్న రీసర్వే ప్రక్రియ పరిశీలన పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు ఆదేశం
- రైతుల సమక్షంలో సర్వే నిర్వహించాలని మార్గనిర్దేశం

ఉద్యమపోరు, నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 09 : రైతులు,భూ యజమానుల ప్రయోజనాలను కాపాడుతూ,భవిష్యత్తులో వారికి ఎలాంటి భూ సమస్యలు తలెత్తకూడదు అనే సదుద్దేశ్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం రీసర్వే జరిపిస్తోందని కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడించారు.ఈ ప్రక్రియకు రైతులు పూర్తి స్థాయిలో సహకరించాలని సూచించారు.సాలూర మండలం ఫతేపూర్ లో కొనసాగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం అదనపు కలెక్టర్ వి.భుజంగరావుతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ,రోవర్ సహాయంతో సర్వే నిర్వహిస్తున్న తీరును క్షుణ్ణంగా పరిశీలిస్తూ,సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వ మార్గదర్శకాలను పక్కాగా పాటిస్తూ,నిబంధనలకు అనుగుణంగా పూర్తి పారదర్శకంగా సర్వే నిర్వహించాలని,తద్వారా ఎలాంటి ఇబ్బందులు ఉత్పన్నం కావని అధికారులకు సూచించారు.రైతులు,పట్టాదార్లకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు.ప్రతిరోజు సగటున 30 ఎకరాల చొప్పున సర్వేను నిర్వహిస్తూ,వేగవంతంగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు.సర్వే సందర్భంగా క్షేత్రస్థాయిలో ఏవైనా ఇబ్బందులు ఏర్పడితే,తమ దృష్టికి తేవాలన్నారు.సర్వే చేపట్టే ముందు సంబంధిత రైతులకు తప్పనిసరిగా ముందస్తు సమాచారం అందించి,వారి సమక్షంలో సర్వే నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.భూమి హద్దుల వివరాల నమోదులో పొరపాట్లు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.కాగా సాలూర మండలంలో తొలి విడతలో మూడు గ్రామాలలో భూముల రీసర్వే జరుగుతోందని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు.ఇప్పటికే బోధన్ రెవెన్యూ డివిజన్ లోని పోతంగల్,రెంజల్ తదితర మండలాల్లో 3వేల ఎకరాల వరకు విస్తీర్ణంలో సర్వే ప్రక్రియ పూర్తయ్యిందని తెలిపారు.రీసర్వే వల్ల భవిష్యత్తులో సరిహద్దు సమస్యలు ఉత్పన్నం కావని,తద్వారా భూ వివాదాలకు ఆస్కారం ఉండదని,భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.సర్వే విషయంలో రైతులకు,భూ యజమానులకు ఏవైనా సందేహాలు ఉంటే గ్రామ పంచాయతీ అధికారులను సంప్రదించాలని సూచించారు.కలెక్టర్ వెంట బోధన్ ఆర్డీఓ విజయకుమారి,సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు శ్రీనివాస్ రావు,స్థానిక అధికారులు,ప్రజాప్రతినిధులు,రైతులు ఉన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి
ఐక్యంగా పోరాడాలి

- టీఎన్‌జీవోస్ మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కార్యవర్గ సమావేశంలో నిర్ణయం.

ఉద్యమపోరు, మేడ్చల్–మల్కాజ్‌గిరి, అక్టోబర్ 09 : ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, పెండింగ్ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఐక్యంగా కృషి చేయాలని తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్‌జీవోస్) మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కార్యవర్గ సమావేశం నిర్ణయించింది. జిల్లా కార్యవర్గ సమావేశంలో ఉద్యోగుల సమస్యలు, యూనియన్ బలోపేతం, రానున్న యూనియన్ ఎన్నికలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.చైర్మన్ అనుమతితో అజెండాలోని కీలక అంశాలను చర్చించిన నాయకులు, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయడం, 2026లో నిర్వహించనున్న యూనియన్ ఎన్నికలకు సన్నద్ధం కావడం, ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపులు, కరువు భత్యం (డీఏ), 2023 జూలై 1 నుంచి అమలు కావాల్సిన పీఆర్సీ బకాయిల విడుదలకు కృషి చేయాలని అభిప్రాయపడ్డారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు హెల్త్ కార్డుల అమలును వేగవంతం చేయాలని కోరారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయానికి సంబంధించిన యూనియన్ కార్యవర్గ సభ్యులపై వచ్చిన ఆరోపణలు, అధికారుల వేధింపులు, కక్ష సాధింపు చర్యల అంశాలు సమావేశంలో చర్చకు వచ్చాయి. ఈ వ్యవహారంలో వాస్తవాలను నిష్పక్షపాతంగా పరిశీలించి, పారదర్శక విచారణ జరిపించాలని నిర్ణయించారు. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదన సమర్పించాలని తీర్మానించారు. అలాగే, యూనియన్‌కు సంబంధించి ఒక పత్రికలో ప్రచురితమైన వార్తలోని అంశాలను యూనియన్ ప్రతినిధులు ఖండించారు. వాస్తవాలను నిర్ధారించుకోకుండా వార్తలు ప్రచురించడం సమంజసం కాదని పేర్కొంటూ, ఉద్యోగ సంఘాల ప్రతిష్ఠకు భంగం కలగకుండా బాధ్యతాయుతమైన జర్నలిజం ప్రమాణాలకు అనుగుణంగా వార్తలు ప్రచురించాలని సూచించారు.ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంఘం నాయకులు, కార్యవర్గ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని, సభ్యత్వ నమోదు నుంచి యూనియన్ బలోపేతం వరకు సమష్టి కార్యాచరణతో ముందుకు సాగాలని సమావేశంలో అభిప్రాయపడ్డారు.సమావేశంలో జిల్లా కార్యదర్శి భారత కుమార్, జిల్లా కోశాధికారి శేష సాయి గిరికాంత్, ఉపాధ్యక్షురాలు రజని, ప్రచార కార్యదర్శులు కొండల్ రావు, అనిల్ కుమార్, సాజిద్ అత్తారి, మల్కాజ్‌గిరి యూనిట్ అధ్యక్షురాలు అరుణ, కార్యదర్శి సుదర్శన్, మేడ్చల్ యూనిట్ అధ్యక్షుడు శ్రీనివాస్, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడు కార్తిక్, కార్యదర్శి అక్షయ్ కుమార్, ఉమాకాంత్, చంద్రకాంత్, షామీర్‌పేట్ యూనిట్ ప్రతినిధులు షెర్లీ, మాణిక్యం, హాస్టల్ వెల్ఫేర్ ప్రతినిధులు పాల్గొన్నారు. సీనియర్ నాయకులు, గ్రౌండ్ వాటర్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు అంజయ్య, సీసీఎల్ఏకు చెందిన శ్రీకాంత్, నందూలాల్, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ – రంగారెడ్డి – హైదరాబాద్
ఎమ్మెల్సీ ఓటర్ ఎన్రోల్మెంట్ కార్యక్రమం

ఉద్యమపోరు, నాగోల్, అక్టోబర్ 09 : నాగోల్ డివిజన్ పరిధిలోని అరుణోదయ కాలనీలో మహబూబ్‌నగర్ – రంగారెడ్డి – హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ ఎన్రోల్మెంట్ కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమం ద్వారా అర్హులైన పట్టభద్రులు తమ ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకునేలా అవగాహన కల్పించడం జరిగింది.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకొని రాబోయే ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని నాయకులు సూచించారు.అదేవిధంగా కాలనీలోని పట్టభద్రులు, యువత ముందుకు వచ్చి ఓటర్ ఎన్రోల్మెంట్ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ శాసనసభ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీ సామ రంగారెడ్డి, నాగోల్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ శ్రీమతి చింతల అరుణ సురేందర్ యాదవ్, కాలనీవాసులు మల్లేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకోవాలి –ప్రజాస్వామ్య బలోపేతంలో భాగస్వాములు కావాలి.

పేదలకు విద్య, వైద్యం అందించడమే ప్రభుత్వాల ప్రథమ ప్రాధాన్యం

- కేంద్ర, రాష్ట్ర శాఖలు సమన్వయంతో పనిచేయాలి..
- దిశ సమావేశంలో అధికారులకు ఎంపీ ఈటల రాజేందర్ ఆదేశాలు..

ఉద్యమపోరు, మేడ్చల్–మల్కాజిగిరి, అక్టోబర్ 09 : ప్రభుత్వ పథకాల ఫలాలు అర్హులైన పేదలకు అందేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. ముఖ్యంగా పేదలకు నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో 24 గంటల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శుక్రవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి వివిధ శాఖల పనితీరును సమీక్షించారు.పేదలకు మెరుగైన వైద్య సేవలుప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని ఎంపీ సూచించారు. ఆసుపత్రుల్లో అవసరమైన వైద్య పరికరాలు, మందులు, నిరంతర విద్యుత్ సరఫరా, మెరుగైన పారిశుద్ధ్యంతోపాటు ప్రసవాల కోసం అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన పేద కార్మికులకు సైతం అత్యవసర వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు.★అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు మెరుగుపరచడంతోపాటు పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని, గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాల కొరతను అధిగమించాలని సూచించారు. గృహహింసకు గురవుతున్న మహిళలకు అండగా నిలిచే సఖి కేంద్రాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

విద్యార్థుల ఆరోగ్యం.. నాణ్యమైన భోజనం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యతతో అందించాలని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. భోజన మెనూ బోర్డులను తప్పనిసరిగా ప్రదర్శించాలన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సహకారంతో విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, పాఠశాలల్లో క్రీడలను ప్రోత్సహించడం ద్వారా విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి తోడ్పడాలని సూచించారు.నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాలిమల్కాజిగిరి, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించే కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎంపీ ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయడంతోపాటు మహిళలు, బలహీన వర్గాలకు ప్రభుత్వ పథకాల ద్వారా మరిన్ని అవకాశాలు కల్పించాలన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుల్లో పారదర్శకత పాటిస్తూ అత్యంత పేదలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు.

యువతకు ఉపాధి అవకాశాలు పెంచాలి..

యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు పొందేలా సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని ఎంపీ పేర్కొన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్ ఆధ్వర్యంలో పారిశ్రామిక, విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, బ్యాంకు రుణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బలహీన వర్గాలు, విద్యార్థులు, స్వయం సహాయక సంఘాలకు నిబంధనల ప్రకారం రుణాలు అందేలా చూడాలని సూచించారు.పరిశ్రమల శాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వం అందించే రుణ పథకాల ప్రయోజనాలను అర్హులకు సకాలంలో చేర్చాలని, కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులను అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించాలని చెప్పారు. జిల్లా ఖనిజ నిధులను ప్రధానంగా విద్య, వైద్యం, అత్యవసర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఖర్చు చేయాలని స్పష్టం చేశారు.

పార్కులు, చెరువుల పరిరక్షణకు చర్యలు

నగర వనాల పథకం కింద పట్టణ పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఈటల రాజేందర్ సూచించారు. చిత్తడి నేలలు, చెరువులను గుర్తించి వాటి పరిరక్షణకు కంచెలు ఏర్పాటు చేయాలన్నారు. రహదారుల విస్తరణ పనులకు అవసరమైన అటవీ శాఖ అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు. జాతీయ రహదారులు, రహదారులు–భవనాలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రహదారి విస్తరణ పనులను వేగవంతం చేయాలన్నారు.

రైతులకు ముందస్తు అవగాహన

ఎల్‌నినో ప్రభావం వల్ల వ్యవసాయంపై పడే ప్రతికూల ప్రభావాలను ఎదుర్కొనేందుకు వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు రైతులకు ముందస్తు అవగాహన కల్పించాలని ఎంపీ సూచించారు. వ్యవసాయ పరికరాలు, ఎరువులు రైతులకు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మను చౌదరి, ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్, వివిధ మున్సిపాలిటీల చైర్మన్లు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో నాణ్యమైన వైద్యం అందించాలి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

- తారా మల్టిస్పెషాలిటీ చిల్డ్రన్స్ ఆసుపత్రి ప్రారంభించిన మంత్రి

ఉద్యమపోరు, తుర్కయంజాల్, అక్టోబర్ 09 : తూర్కయంజాల్ బ్రాహ్మణపల్లి చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన తారా మల్టిస్పెషాలిటీ చిల్డ్రన్స్ ఆసుపత్రినీ తెలంగాణ రాష్ట్ర రోడ్డు భవనాలు సినిమాటోగ్రాఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఈటెలా రాజేందర్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, దేవరకొండ నియోజకవర్గం ఎమ్మెల్యే బాలు నాయక్, అచ్చంపేట నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ, కల్వకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, రోడ్ల కార్పొరేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, ఎమ్మెల్సి గోరేటి వెంకన్న, ఎమ్మెల్సి ఎలిగంటి సత్యం, సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, సిపిఐ(ఎం) రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు టి సాగర్, డిజి నర్సింహా రావు, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి లు పాల్గొని ఆసుపత్రిలోని వివిధ విభాగాలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందించే లక్ష్యంతో తూర్కయంజాల్ లో 'తారా మల్టిస్పెషాలిటీ చిల్డ్రన్స్ ఆసుపత్రినీ ఘనంగా ప్రారంభించటం సంతోషంగా ఉందన్నారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందించి లాభాపేక్షతో కాకుండా సేవా గుణంతో ప్రజలకు వైద్యం చేయాలనీ సూచించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి యాజమాన్యం మాట్లాడుతూ..ఇబ్రహీంపట్నం, దేవరకొండ, కల్వకుర్తి, మునుగోడు, అచ్చంపేట నియోజకవర్గాల ప్రజలకు మా ఆసుపత్రి అందుబాటులో ఉంటుందనీ చెప్పారు.సామాన్య ప్రజలకు అందుబాటు ధరలో నాణ్యమైన వైద్యం అందించడమే మా ప్రధాన లక్ష్యం. తార మల్టిస్పెషాలిటీ ఆసుపత్రి ద్వారా ప్రతి ఒక్కరికీ మెరుగైన ఆరోగ్య సేవలు అందించి, ఈ ప్రాంత ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇస్తాము" అని తెలిపారు.ఈ ఆసుపత్రిలో జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్స్, కార్డియాలజీ, జనరల్ సర్జరీ, అనేస్తాషియా వంటి అన్ని ప్రధాన విభాగాలు అందుబాటులో ఉంటాయి. అనుభవజ్ఞులైన డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది మరియు అత్యాధునిక పరికరాలతో 24/7 అత్యవసర సేవలు, ల్యాబ్, ఫార్మసీ,సిటీ స్కాన్, ఇన్–పేషెంట్ సేవలను అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాజమాన్యం డాక్టర్లు తరుణ్ తెజ్, సంతోష్ వర్మ, ఐశ్వర్య, లక్ష్మణ్ రెడ్డి, శ్రవణ్ కుమార్, మాలోత్ రాజు, సుధాకర్ రెడ్డి, లహరీ తిరుణగారి, అలేఖ్య రెడ్డి, శృతి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Bandari Srujana, on behalf of Sri Venkateswara Printing Solutions, Editor - Bandari Sumanth, is responsible for news selection under PRB act
prgi.gov.in RNI.TGTEL/26/A7716, # 19-212/3-3A, Narsampet, Warangal, Telangana, India - 506132, Cell : 7569337969 Email:udyamaporu@gmail.com